## క్లుప్తంగా

### ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

సదుం: వినాయక చవతిని పురస్కరించుకుని విద్యుత్ ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ట్రాన్స్‌కో ఏఈ చంద్రశేఖర్ తెలిపారు. వినాయక విగ్రహాలను వాహనాలలో మండపాలకు తీసుకువచ్చే సమయంలో, నిమజ్జనంకు తరలిం చేటప్పుడు విద్యుత్ కేబుళ్లకు తగలకుండా అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. మండపాలను విద్యుత్ దీపాలు అలంకరించేందుకు ఏర్పాటు చేసిన వైరింగ్‌లో లోపాలు లేకుండా చూసుకోవాలని సూచించారు. మండపాలకు తాత్కాలిక విద్యుత్ సరీ్వసు కనెక్షన్ తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

### అంగన్‌వాడీ కార్యకర్త మృతి


ప్రమీలమ్మ

చౌడేపల్లె: మండలంలోని ఏ.కొత్తకోట అంగన్‌వాడీ కార్యకర్త ప్రమీలమ్మ(59) అనారోగ్యంతో శనివారం మృతిచెందారు. ఆమె కొన్నేళ్లుగా అంగన్‌వాడీ కార్యకర్తగా పనిచేస్తున్నారు. ఇటీవల అనారోగ్యం బారిన పడ్డారు. చికిత్స పొందుతున్నారు. ఈక్రమంలో శనివారం మృతిచెందారు. ఆమె మృతికి ఐసీడీఎస్ సీడీపీవో రాజేశ్వరి, సూపర్‌వైజర్లు రాధమ్మ, సులోచన, అంగన్‌వాడీ సిబ్బంది సంతాపం ప్రకటించారు.

### వైభవంగా శనీశ్వరస్వామి కల్యాణం


కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

వి.కోట: మండలంలోని పాపేపల్లిమిట్టలో వున్న శనీశ్వర స్వామి ఆలయంలో శనివారం జ్యేష్టాదేవి సమేత శనీశ్వరస్వామి కల్యాణాన్ని వేద పండితులు శాస్త్రోక్తంగా చేపట్టారు. ఉదయం స్వామికి తైలాభిషేకం చేశారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. తదుపరి శుభ కన్యాలగ్నంలో స్వామివారి కల్యాణాన్ని జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ధర్మకర్త లక్ష్మీనారాయణ రాజు, కమిటీ సభ్యులు హాజరయ్యారు.

### ఎరువుల దుకాణాల్లో తనిఖీ


తనిఖీలు చేస్తున్న అధికారులు

వి.కోట: పట్టణంలోని పలు ఎరువుల దుకాణాలను శనివారం విజిలెన్స్ అధికారులు తనిఖీ చేశారు. కేజీఎఫ్ రోడ్డులోని వినాయక ట్రేడర్స్, మురళీకృష్ణ ట్రేడర్స్‌లో ఎరువులు, యూరియా స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ వెంకటరవి, మండల వ్యవసాయాధికారి అప్పోజీ మాట్లాడుతూ ప్రస్తుతం యూరియా కొరత వుందని తెలిపారు. ఈ క్రమంలో రైతులకు యూరియా సక్రమంగా అందజేస్తున్నారా.. లేదా అని తనిఖీలు చేస్తున్నట్టు తెలిపారు.

### ఆర్‌పీఎఫ్ రాష్ట్ర జనరల్ సెక్రటరీగా మధుసూదన్


నియామక పత్రం అందుకుంటున్న మధుసూదన్‌రాయల్

పుంగనూరు: రాయల్ పీపుల్స్ ఫ్రంట్ రాష్ట్ర జనరల్ సెక్రటరీగా మధుసూదన్‌రాయల్ నియమితులయ్యారు. ఆయనకు శనివారం ఆ సంఘం వ్యవస్థాపకుడు రెడ్డిశేఖర్‌రాయల్ నియామక పత్రం అందజేశారు. అలాగే రాయలసీమ జోన్ లీగల్ అడ్వైజర్‌గా మనోహర్‌రాయల్‌ను నియమించారు. వారు మాట్లాడుతూ బలిజ కులస్తుల ఐక్యతతో పాటు సమాజాభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆంజనేయప్రసాద్, నానబాలకుమార్, నానబాలసుబ్రమణ్యం, మంజునాథ్ పాల్గొన్నారు.

### వర్షాకాలం వ్యాధులతో జాగ్రత్తగా ఉండాలి


తీర్థంలో అవగాహన ర్యాలీ చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

బైరెడ్డిపల్లె: ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తగా వుండాలని బైరెడ్డిపల్లె, తీర్థం పీహెచ్‌సీల వైద్యులు విజయ్‌చంద్ర, అరుణ్‌కుమార్ తెలిపారు. వారు పీహెచ్‌సీల పరిధిలోని గ్రామాల్లో స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. అవగాహన ర్యాలీ చేపట్టారు. వారు మాట్లాడుతూ పరిసరాలను శుభ్రంగా వుంచుకోవాలన్నారు. దోమకాటుతో డెంగీ, మలేరియా, చికున్‌గునియా తదితర జ్వరాలు వస్తాయని, జాగ్రత్తగా వుండాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్లు సావిత్రమ్మ, కాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదపుటంచున డీకేపల్లి చెరువు కట్ట

- మొరువ వద్ద యథేచ్ఛగా మట్టి తవ్వకాలు
- దెబ్బతింటున్న చెరువు కట్ట
- భారీ వర్షాలు కురిస్తే కట్టకు ప్రమాదమే
- ఆందోళన చెందుతున్న ఆయకట్టు రైతులు


డీకే పల్లి చెరువు మొరవలో భారీగా తవ్విన దృశ్యాలు

కుప్పం: కుప్పం నియోజకవర్గంలో మట్టి, ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. కొందరు అధికార పార్టీ నేతల అండతో ఎక్కడ పడితే అక్కడ మట్టిని తవ్వి తరలిస్తూ రూ.లక్షలు ఆర్జిస్తున్నారు. ఈ విషయం తెలిసినా రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. కుప్పం మండలంలో మట్టి వ్యాపారులు రెచ్చిపోతున్నారు. అధికార పార్టీ నాయకుల అండతో డీకే పల్లి చెరువులో మట్టిని తవ్వి తరలిస్తున్నారు. దీంతో చెరువు కట్ట ప్రమాదంలో పడిందని రైతులు, పట్టణ వాసులు వాపోతున్నారు. ఈ చెరువు 15 ఎకరాల విస్తీర్ణంలో వుంది. కొంతమంది చెరువు భూమిని ఆక్రమించుకున్నారు. ప్రస్తుతం కుప్పంలో ఎక్కువగా రియల్ ఎస్టేట్ వ్యాపారులు వెంచర్లు వేస్తున్నారు. వాటిని బాగు చేయడానికి మట్టి అవసరమైంది. దీన్ని ఆసరాగా తీసుకున్న కొంతమంది పచ్చనేతలు డీకేపల్లి చెరువులో మట్టి తవ్వకాలకు తెగబడ్డారు. ఇష్టానుసారంగా మట్టి తవ్వకాలు చేపట్టడంతో కట్ట ప్రమాదకరంగా మారింది. ముఖ్యంగా చెరువు మొరవలో పది అడుగులకు పైగా లోతులో మట్టిని తవ్వేశారు. భవిష్యత్తులో భారీ వర్షాలు కురిసి చెరువులోకి నీరు చేరితే కట్ట దెబ్బ తినే పరిస్థితి నెలకొందని పట్టణ వాసులు వాపోతున్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే పాతపేట, హెచ్.పి రోడ్డు, విజయలక్ష్మి రోడ్డు, ఆర్.ఎస్.పేట ప్రాంతాలకు ముప్పు తప్పదని చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెరువులో మట్టిని తవ్వే వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# ట్రెజరీలో ఆయన రూటేవేరు!

- ఎస్టీవోను సైతం లెక్కచేయని వైనం
- ఫైల్ ముందుకు వెళ్లాలంటే అనేక కొర్రీలు
- ఆయనపై చర్యలకు రంగం సిద్ధం


సీనియర్ అకౌంటెంట్‌పై విచారణ చేపట్టాలని ఇచ్చిన నోటీసు

పలమనేరు: పలమనేరు ఎస్టీవో కార్యాలయంలోని ఆ ఉద్యోగి రూటేవేరు. ఆయన ఎస్టీవోను సైతం లెక్కచేయరు. తాను లోకల్ అని, తనను ఎవరూ ఏమీ చేయలేరని బహిరంగంగా సవాళ్లు విసురుతూ ఉంటారు. ఇప్పటి వరకు ఆయన అవినీతి, ఆగడాలపై సహించిన పలు సంఘాల నేతలు పలమార్లు జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేశారు. ఈ క్రమంలో ఏపీ సివిల్ సర్వీసెస్ రూల్ 20(2) ప్రకారం జిల్లా ఖజానా కార్యాలయ సహాయ ఖజానా అధికారి వాసుదేవన్‌ను విచారణ చేసిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా గతనెల 29న ఇక్కడి కార్యాలయానికి చెందిన సీనియర్ అకౌంటెంట్ మజుబుర్ రెహమాన్ ఏపీ రిటైర్డ్ ఎంప్లాయిస్ నేతతో దురుసుగా మాట్లాడినట్టు విచారణలో తేలినట్టు తెలిసింది. అదే రోజు ఎస్టీవో కిరణ్ కుమార్‌ను బండబూతులు తిట్టి దుర్భాషలాడినట్టు సమాచారం. ఎస్టీవోను తన గుప్పిట్లో పెట్టుకునేందుకు ఉన్నతాధికారులకు ఆకాశ రామన్న పేరిట ఫిర్యాదు చేసినట్టు విచారణ అధికారులు అనుమానిస్తున్నట్టు తెలిసింది. గతంలోనూ ఆయనపై పలు ఆరోపణలున్నట్టు సమాచారం. న్యాయమైన బిల్లులను సైతం పాస్ చేయకుండా కొర్రీలు పెట్టి డబ్బు డిమాండ్ చేసినట్టు సమాచారం. ఈ విషయంపై మున్సిపల్, ఎంపీడీవో, ఆర్టీసీ, మున్సిపల్ శాఖల ద్వారా విచారణ అధికారి తెలుసుకున్నట్టు సమాచారం. ఆయన తప్పు చేసినట్టుగానే తేలిందని ఇక్కడి కార్యాలయ అధికారులు గుసగుసలాడుతున్నారు. విచారణ అధికారి నివేదిక ఆధారంగా ఆయనపై శాఖాపరమైన చర్యలు తప్పవని తెలిసింది. ఈ విషయమై స్థానిక ఎస్టీవో కిరణ్‌కుమార్‌ను వివరణ కోరగా కార్యాలయంలో సిబ్బంది ముందే తననే బండబూతులు తిట్టిన సీనియర్ అకౌంటెంట్‌పై విచారణ అధికారికి తెలిపిన మాట నిజమేనన్నారు. విచారణలోని అంశాలతో ఉన్నతాధికారులు తగు చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు.

# సమయానికి రారు... సేవలు అందించరు


సచివాలయంలో ఖాళీగా వున్న కుర్చీలు

చౌడేపల్లె: మండలంలోని పుదిపట్ల సచివాలయంలో సిబ్బంది సమయానికి రావడం లేదు. వచ్చినా ప్రజలకు సక్రమంగా సేవలందించడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. వివిధ పనుల నిమిత్తం సచివాలయానికి వెళితే ఎవరూ లేకపోవడంతో వెనుదిరగాల్సి వస్తోందని వాపోతున్నారు. శనివారం ఏఎన్ఎం పార్వతి, డీఏ శ్రీకాంత్ తప్ప సిబ్బంది ఎవరూ రాలేదు. సమస్యలను సచివాలయంలో తెలిపేందుకు వెళ్లిన వారితో కొందరు సిబ్బంది దురుసుగా ప్రవరిస్తున్నారన్న ఆరోపణలు వున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి సిబ్బంది సమయపాలన పాటించడంతోపాటు ప్రజలతో మంచి మాట్లాడేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

### డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లకు రిజిస్ట్రేషన్లు మొదలు

పలమనేరు: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఈ నెల 18 నుంచి మొదలైందని ప్రిన్సిపాల్ వెంకటేశులు తెలిపారు. ఇక్కడ బీఏ(రాజనీతి శాస్త్రం, ఉర్దూ), బీకాం, బీకాం కంప్యూటర్స్, బీబీఏ, బీఎస్సీలో కెమిస్ట్రీ, మ్యాథ్స్, జువాలజీ, ఫిజిక్స్, హార్టికల్చర్ తదితర కోర్సులు ఉన్నాయని తెలిపారు. ఇంటర్ పాసైన విద్యార్థులు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాల కోసం కార్యాలయ పనివేళల్లో సంప్రదించాలని తెలిపారు.

# విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలి



బెనర్జీని సత్కరిస్తున్న కళాశాల యాజమాన్యం

కుప్పం రూరల్: ప్రతి ఒక్క విద్యార్థీ కష్టపడి చదివి శాస్త్రవేత్తగా ఎదగాలని కుప్పం ఇంజినీరింగ్ కళాశాల వైస్ చైర్మన్ సునీల్‌రాజ్ తెలిపారు. ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం ఈసీఈ ఆధ్వర్యంలో జాతీయ అంతరిక్ష దినోత్సవం–2025 నిర్వహించారు. ఇందులో ముఖ్య అతిథులుగా ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆస్ట్రో ఫిజిక్స్ అధ్యాపకులు బెనర్జీ, సునీల్‌రాజ్ పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ భారత అంతరిక్ష వ్యవస్థ ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. అమెరికా వంటి దేశాలు మనదేశానికి వచ్చి రాకెట్లు పంపడం గర్వించదగ్గ విషయమన్నారు. విద్యార్థులు అబ్దుల్‌కలాంను ఆదర్శంగా తీసుకుని దేశ సేవకు అంకితం కావాలని ఆకాంక్షించారు. ప్రిన్సిపాల్ సుధాకర్‌బాబు మాట్లాడుతూ సాంకేతిక విశిష్ట గురించి విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు అందజేసిన విశిష్ట ప్రతులకు బహుమతులు అందజేశారు. అనంతరం బెనర్జీని సన్మానించారు. కార్యక్రమంలో అజయ్‌కుమార్, రసాదురై, సంతోష్, బి.పంజగల్, లక్ష్మీపతి పాల్గొన్నారు.

### పాలిటెక్నిక్ కళాశాలలో ఉచిత దంత వైద్య శిబిరం


దంత పరీక్షలు చేస్తున్న వైద్యులు

కుప్పం: కుప్పంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శనివారం అరుణ్ డెంటల్ కేర్ వైద్యులు ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. కళాశాలలో చదువుకుంటున్న 300 మంది విద్యార్థులకు దంత పరీక్షలు చేశారు. వైద్యులు అరుణ్ మాట్లాడుతూ దంత సమస్యల గురించి ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి వుండాలన్నారు. దంతాలు ఆరోగ్యంగా వుండాలంటే పోషక ఆహారాలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ శివసాయి, అధ్యాపకులు జగన్నాధరావు, ప్రవీణ్ కుమార్, రామక్రిష్ణ పాల్గొన్నారు.


కావిడితో ఆలయానికి వస్తున్న ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి

### మొక్కులు చెల్లించిన ఎమ్మెల్యే

సదుం: స్థానిక వల్లీ దేవసేన సమేత సుబ్రమణ్య స్వామి ఆలయాన్ని శనివారం తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ రెడ్డి సందర్శించారు. పుష్పకావడితో మొక్కులు చెల్లించారు. ఆయనకు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు స్వాగతం పలికి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం ఆలయ మర్యాదలతో సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పెద్దిరెడ్డి ఇందిరమ్మ, పెద్దిరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, కృష్ణారెడ్డి, మల్‌రెడ్డి, నాగభూషణరెడ్డి, భాస్కర్‌రెడ్డి, మోహన్ రెడ్డి, రమణారెడ్డి, ఎంపీటీసీ శ్రీలత, చింటూ, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

### విద్యుత్ షాక్‌తో కార్మికుడికి తీవ్ర గాయాలు



రొంపిచెర్ల: మండలంలోని గానుగచింత పంచాయతీలోని లోకవారిపల్లె సమీపంలో శనివారం రాత్రి విద్యుత్ షాక్‌తో కార్మికుడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల కథనం మేరకు.. రాజస్థాన్‌కు చెందిన అల్‌మేన్ ఉమేన్(20) రొంపిచెర్ల మండలంలో విద్యుత్ స్తంభాల ఏర్పాటు పనుల్లో కాంట్రాక్టర్ వద్ద పని చేస్తున్నాడు. శనివారం ఉదయం ఎల్‌సీ తీసుకుని స్తంభాల పనులు చేస్తున్నారు. ఈ క్రమంలోనే విద్యుత్ సరఫరా లేదని భావించి శనివారం రాత్రి 7 గంటల ప్రాంతంలో విద్యుత్ స్తంభం ఎక్కాడు. విద్యుత్ షాక్ కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని వెంటనే పీలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. డాక్టర్లు మెరుగైన చికిత్స కోసం వేలూరు సీఎంసీ ఆస్పత్రికి రెఫర్ చేశారు. దీనిపై తమకు ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

# వినాయక విగ్రహాలకు అనుమతి తప్పనిసరి


మాట్లాడుతున్న సీఐ సుబ్బరాయుడు

పుంగనూరు: వినాయకుడి విగ్రహాల ఏర్పాటుకు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని పుంగనూరు సీఐ సుబ్బరాయుడు తెలిపారు. ఆయన శనివారం పుంగనూరు పట్టణంలోని జేఎండీ కల్యాణ మండపంలో వివిధ ప్రభుత్వశాఖల అధికారులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ వినాయకుడి విగ్రహాలు ఏర్పాటుచేసేవారు హెచ్‌టిటిపిఎస్://గణేష్ ఉత్సవ్‌డాట్‌నెట్‌లో లాగిన్ అయి చిరునామా, ఫోన్ నంబర్లు, మండపం ఏర్పాటు వివరాలను నమోదు చేయాలని సూచించారు. అధికారుల అనుమతి వచ్చిన తర్వాత వినాయక ఉత్సవాలు ఎన్నిరోజులు నిర్వహిస్తారో తెలియజేయాలన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ హరిప్రసాద్, అగ్నిమాపకశాఖ అధికారి సుబ్బరాజు పాల్గొన్నారు.

**విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి**

పులిచెర్ల(కల్లూరు): వినాయకుడి విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని కల్లూరు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. కల్లూరులోని నాలుగు రోడ్ల కూడలి, బహిరంగ ప్రదేశాల్లో ప్రజలకు ఇబ్బంది లేకుండా విగ్రహాలు పెట్టుకోవాలన్నారు. విగ్రహాల ఊరేగింపు, నిమజ్జనం రోజు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉత్సవ కమిటీ సభ్యులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

### గుర్తు తెలియని మృతదేహం లభ్యం

పూతలపట్టు(యాదమరి): మండలంలోని బందార్లపల్లిలో చిత్తూరు–తిరుపతి రైల్వే మార్గంలో తీవ్ర గాయాలతో రక్తపు మడుగులో గుర్తు తెలియని మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. పూతలపట్టు సీఐ కృష్ణమోహన్, రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలికి చేరుకున్న వారు మృతికి గల కారణాలను అన్వేషిస్తున్నారు. మృతుడి శరీరంపై ఉన్న గాయాలను బట్టి ఆత్మహత్య చేసుకున్నాడా ? లేక ప్రమాదవశాత్తు జారి కింద పడి మృతి చెందాడా ? కోణంలో విచారిస్తున్నారు. మృతుడి వివరాలు తెలియాల్సి ఉంది.

# పరవళ్లు తొక్కుతున్న కైగల్ జలపాతం


పరవళ్లు తొక్కుతున్న కైగల్ జలపాతం

బైరెడ్డిపల్లె: మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పలమనేరు–కుప్పం జాతీయ రహదారిలోని పర్యాటక ప్రాంతమైన కైగల్ జలపాతం పరవళ్లు తొక్కుతోంది. పలువురు పర్యాటకులు, ప్రకృతి ప్రేమికులు అక్కడికి చేరుకుని సంతోషంగా గడుపుతున్నారు. జలపాతం వద్దకు వెళ్లే రోడ్డు గుంతలు పడడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు వాపోతున్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు. కైగల్ జలపాతం వద్ద ప్రమాదం పొంచి ఉందని, పర్యాటకులు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

### మండలానికి చేరిన కృష్ణా జలాలు


కృష్ణా జలాలకు పూజలు చేస్తున్న అధికారులు, నాయకులు

వి.కోట: హంద్రీనీవా కాలువ ద్వారా కృష్ణా జలాలు శనివారం మండలానికి చేరాయి. ఈ సందర్భంగా కూటమి నేతలు జలాలకు ప్రత్యేక పూజలు చేశారు. బైరెడ్డిపల్లి మండలం దాటాక సైఫాన్ సిస్టం ద్వారా నీరు కృష్ణాపురం గ్రామం భద్రన్న మోట్లపల్లి పంపు హౌస్‌కు చేరింది. అక్కడ అధికారులు, కూటమి నేతలు ప్రత్యేక పూజలు చేసి భారీ మోటార్లను ఆన్ చేసి నీటిని కుప్పం వైపు మళ్లించారు. కార్యక్రమంలో హంద్రీనీవా ఈఈ వెంకటేశ్వర్‌రావు, ఇంజినీర్ వరప్రసాద్, డీఈ గోవర్ధన్, రిత్విక్, పీడీ నాగేశ్వరరావు, టెక్నికల్ ఇన్‌చార్జి రావు, కూటమి నేతలు రామచంద్రనాయుడు, రంగనాథ్, చౌడప్ప, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

### గుర్తు తెలియని వాహనం ఢీకొని విద్యుత్ స్తంభం ధ్వంసం


నేలకొరిగిన విద్యుత్ స్తంభం

చౌడేపల్లె: మండలంలోని కాగతి నుంచి గుట్టకిందపల్లెకు వెళ్లే రోడ్డులోని కొత్తయిండ్లు వద్ద శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో విద్యుత్ స్తంభం ధ్వంసమైంది. ఆ సమయంలో ఇతర వాహనాలు ఏవీ వెళ్లకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న ట్రాన్స్‌కో ఏఈ శశిధర్ యుద్ధ ప్రాతిపదికన మరొక స్తంభాన్ని ఏర్పాటుచేయించారు.

# విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల పంపిణీ


విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేస్తున్న కలెక్టర్

చౌడేపల్లె: పదో తరగతిలో ప్రతిభ చూపిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు శనివారం అన్నమయ్య జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ స్కాలర్‌షిప్‌లు అందజేశారు. క్రెడిట్ యాక్సెస్ ఇండియన్ ఫౌండేషన్ గ్రామీణ విద్య స్కాలర్‌షిప్‌లో భాగంగా 2024–2025లో పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ చూపిన పిల్లలకు రూ.10 వేల చొప్పున స్కాలర్‌షిప్‌లు, జ్ఞాపిక, సర్టిఫికెట్లు అందజేస్తోంది. ఇందులో భాగంగానే కలెక్టర్ చాంబర్‌లో శనివారం చౌడేపల్లెకు చెందిన భవ్యశ్రీ, రెడ్డిరాణి, మదనపల్లెకు చెందిన ఏ.పూజిత, కదిరి సాధిక ఇంటర్ విద్యార్థి ములకలచెరువుకు చెందిన పి.తేజశ్వనికి ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ డివిజినల్ మేనేజర్ జగదీష్, ఏరియా మేనేజరు హనుమంతయ్య, శంకర, బ్రాంచి మేనేజరు మధుసూదనరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### నేటి పిల్లలే రేపటి శాస్త్రవేత్తలు


మ్యాజిక్‌ను ప్రదర్శిస్తున్న జేవీవీ నేతలు

పలమనేరు: నేటి పిల్లలే రేపటి శాస్త్రవేత్తలని, సైన్సు ద్వారా మూఢనమ్మకాలను పారదోలవచ్చని జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి మిఠాయి యుగంధర్‌బాబు తెలిపారు. స్థానిక అంబేడ్కర్ బాలికల కళాశాలలో శనివారం మూఢ నమ్మకాలపై వండర్ సైన్సు మ్యాజిక్ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా తలపై మంట పెట్టడం, నోట్లో శూలాలను గుచ్చుకోవడం, నోటి నుంచి శివ లింగం తీయడం తదితరాలను చేసి చూపించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

# తూతూమంత్రంగా స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర

- ర్యాలీలు, ప్రతిజ్ఞతోనే సరిపెడుతున్న వైనం
- ప్రతినెలా మూడో శనివారం ప్రహసనంగా కార్యక్రమం
- పట్టణంలో మెరుగుపడని పారిశుద్ధ్యం


స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్రలో భాగంగా పలమనేరులో ర్యాలీ చేస్తున్న వైద్య, ఆరోగ్య సిబ్బంది

పలమనేరు: పరిసరాలు శుభ్రంగా ఉంటే ప్రజలు రోగాల బారిన పడకుండా వుంటారు. ఈ క్రమంలో ప్రభుత్వం ప్రతినెలా మూడో శనివారం స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా అధికారులు పారిశుద్ధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించడానికి ర్యాలీలు నిర్వహిస్తున్నారు. పలమనేరు మున్సిపాలిటీలో ఎనిమిది నెలలుగా కార్యక్రమాన్ని చేపడుతున్నారు. పట్టణంలో పారిశుద్ధ్యం మాత్రం బాగుపడడం లేదు. శనివారం కూడా అధికారులు మెప్మా మహిళలు, విద్యార్థులతో కలిసి మున్సిపల్ కార్యాలయం వద్ద ర్యాలీ ప్రారంభించారు. అంబేడ్కర్ సర్కిల్ వరకు వెళ్లి అక్కడ ప్రతిజ్ఞ చేశారు.

**ఇదీ కార్యక్రమం ఉద్దేశం**

మున్సిపాలిటీ పరిధిలోని సచివాలయాలు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద స్వచ్ఛాంధ్ర కార్యక్రమం చేపట్టాలి. పారిశుద్ధ్య నిర్వహణలో భాగంగా ఇళ్లలోని తడి, పొడి చెత్తను వేరుచేసి ప్రభుత్వం అందించిన బుట్టల్లో వేయాలి. వాటిని ఇళ్ల వద్దకు వచ్చే పారిశుద్ధ్య కార్మికులకు అందజేయాలి. దీనిపై ప్రజల్లో అవగాహన కల్పించి పట్టణంలో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచాలి. పలమనేరు పట్టణంలో కార్యక్రమాన్ని ప్రతినెలా మమా అనిపిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎక్కడి చెత్త అక్కడే దర్శనమిస్తోంది. కాలువల్లో మురుగు ముందుకు కదలడం లేదు. ప్రజలు ఎవరైనా ఫిర్యాదు చేస్తే అక్కడికి వెళ్లి శుభ్రం చేసి చేతులు దులుపుకుంటున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్లే ఇలా జరుగుతోందన్న విమర్శలు వున్నాయి.

**గతంలో వున్న చిత్తశుద్ధి ఏదీ..?**

పలమనేరు పట్టణంలో పారిశుద్ధ్యంపై తగిన శ్రద్ధ చూపడం లేదు. గతంలో మున్సిపల్ కమిషనర్లు తెల్లవారుజామున ఐదు గంటలకే వీధుల్లో తిరుగుతూ పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించేవారు. సూర్యుడు ఉదయించేలోపు పట్టణంలోని చెత్తను డంపింగ్ యార్డుకు తరలించేవారు. దీంతో పలమనేరు మున్సిపాలిటీ గ్రీన్‌లీఫ్ అవార్డును సైతం పొందింది. నేడు మధ్యాహ్నం 12 గంటలకు కూడా పారిశుద్ధ్య సిబ్బంది వీధుల్లో చెత్తను తొలగిస్తూ వుంటున్నారు. కొన్నిచోట్ల చెత్త పేరుకుపోయిందని ఎవరైనా ఫిర్యాదు చేస్తేకానీ తొలగించడం లేదు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

పలమనేరు, కుప్పం : 93981 01870
పుంగనూరు : 96524 21441